జ్వాల తెలుగు న్యూస్
RNI NO: TELTEL/2023/88524
# మెదక్ టుడే
MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...
29 మార్చి 2026 మెదక్ పేజీలు :4 వెల రూ.:2 ఎడిటర్: సిహెచ్. శివకుమార్ సంపుటి 02 సంచిక 119

# మైనింగ్ చిచ్చు !

## శాసనసభలో మాటల యుద్ధం..

**పదేళ్ల అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశం**

**"రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌తో పొంగులేటికి సంబంధం లేదు..**

**గత పదేళ్ల ఇసుక మాఫియాపై లెక్క తేలుస్తాం: సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ మార్చి 28:** తెలంగాణ అసెంబ్లీలో మైనింగ్ పద్దులపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ దద్దరిల్లగా, చివరికి 2014 నుంచి జరిగిన అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది.

**హరీశ్‌రావు ఆరోపణలు: "రక్షకులే భక్షకులయ్యారు"**

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చర్చను ప్రారంభిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్'పై తీవ్ర విమర్శలు చేశారు. అనుమతులు లేకుండానే ఈ సంస్థ క్రషర్లు నడుపుతోందని, నిబంధనలను బేఖాతరు చేస్తూ మైనింగ్ చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఈ వ్యవహారంపై సభా సంఘం (ఎశీబంవ జశీఎఎ్‌వవ) వేయాలని డిమాండ్ చేశారు.

**మంత్రుల ధ్వజం: "పదేళ్ల అవినీతిపై నజర్ పెట్టండి"**

హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, వివేక్ వెంకటస్వామి తీవ్రంగా మండిపడ్డారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఇసుక, మైనింగ్ అక్రమాలను వారు ప్రస్తావించారు. కేవలం ఒక సంస్థను లక్ష్యంగా చేసుకోవడం తగదని, శాఖాపరమైన విచారణకు తాము సిద్ధమని గనుల శాఖ మంత్రి ప్రకటించారు.

**సభలో హైడ్రామా: వెల్‌లోకి బీఆర్ఎస్ సభ్యులు**

మంత్రుల సమాధానంతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సభలో గందరగోళం కొనసాగింది.

రేవంత్ రెడ్డి 'మాస్టర్ స్ట్రోక్': 2014

మిగతా 2లో

**విశ్వ సంక్షోభంలోనూ..**

# భారత్ సురక్షితం



**అభివృద్ధి ఆగదు".. ప్రధాని మోదీ ధీమా!**

**నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశ ప్రారంభం..**

**యుద్ధ మేఘాల మధ్యే భారత్ ప్రగతి పథం!**

**నోయిడా మార్చి 28:** ప్రపంచ దేశాలను యుద్ధ మేఘాలు కమ్మేస్తున్న వేళ, పెట్రోల్ నుంచి నిత్యావసరాల వరకు అన్నీ కొరతగా మారుతున్నా.. భారత్ మాత్రం తన అభివృద్ధి బాటను వీడటం లేదు. పశ్చిమాసియాలో ఇరాన్ లక్ష్యంగా సాగుతున్న భీకర యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న తరుణంలో, ప్రధాని నరేంద్ర మోదీ శనివారం జేవర్ (నోయిడా)లో ఒక భారీ అభివృద్ధి సంకేతాన్ని ఆవిష్కరించారు. రూ. 11,200 కోట్లతో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు.

**సంక్షోభ సమయాన.. ధైర్యమే ఆయుధం**

బహిరంగ సభలో ప్రధాని చేసిన ప్రసంగం దేశ ప్రజల్లో భరోసా నింపడమే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక గట్టి హెచ్చరికలా నిలిచింది. "ప్రపంచం గ్యాస్, ఇంధనం, ఆహార కొరతతో కొట్టుమిట్టాడుతోంది. కానీ భారత్ మాత్రం తన రైతులకు, సామాన్యులకు ఆ యుద్ధ భారం తగలకుండా రక్షణ కవచంలా నిలబడింది" అని ప్రధాని స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా, దేశ ప్రజలు మరింత శాంతంగా, ఐక్యంగా ఉంటూ అభివృద్ధిలో

# డీఎంకే దూకుడు

**164 సీట్లతో స్టాలిన్ మార్క్ వ్యూహం!**

**మిత్రపక్షాలకు 70 స్థానాలు..**

**కొలత్తూరు నుంచే సీఎం, చెపాక్ బరిలో ఉదయనిధి!**



**చెన్నై మార్చి 28:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల రణక్షేత్రంలో అధికార డీఎంకే తన తొలి అస్త్రాన్ని ప్రయోగించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ, మిత్రపక్షాలను కలుపుకుపోతూనే మెజారిటీ స్థానాల్లో తమ పార్టీ జెండా ఎగిరేలా 164 సీట్ల భారీ కోటను సిద్ధం చేసుకున్నారు. మిగిలిన 70 స్థానాలను మిత్రపక్షాలకు కేటాయిస్తూ పొత్తుల లెక్కను తేల్చేశారు.

వ్యూహాత్మక పంపిణీ: ఎవరి వాటా ఎంత? కూటమిలోని పార్టీల బలాబలాలను బట్టి సీట్లను పక్కాగా సర్దుబాటు చేశారు. జాతీయ స్థాయిలో బలమైన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 28 సీట్లు కేటాయించారు. డీఎండీకేకు 10, వీసీకేకు 8, మరియు వామపక్షాలకు (సీపీఐ, సీపీఎం) చెరో 5 స్థానాలను ఇచ్చి సామాజిక సమతుల్యతను కాపాడారు. ఎండీఎంకేతో పాటు ఇతర చిన్న పార్టీలను కలుపుకుని

# ఇంచ్ కూడా కదపలేరు

**అమరావతి అజేయం.. ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకం**

**అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు గర్జన!**

**ఏకగ్రీవ తీర్మానంతో అమరావతికి 'చట్ట' భద్రత!**

*"ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఒక్కటే.. అది అమరావతి మాత్రమే! దీనిని ఎవరూ టచ్ చేయలేరు, ఇంచ్ కూడా కదపలేరు" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తేల్చిచెప్పారు. శనివారం ఉదయం 11:11 నిమిషాల శుభ ముహూర్తాన, అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆయన చారిత్రాత్మక తీర్మానాన్ని స్వయంగా ప్రవేశపెట్టారు. ఐదున్నర గంటల సుదీర్ఘ చర్చ అనంతరం సభ దీనికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది*



# జీతం మీది...

# జీవితం వాళ్లది



**అమ్మనాన్నలకు 'భరోసా'**

**బాధ్యత మరిచిన బిడ్డలకు 'బ్రేక్'**

**అమ్మనాన్నలను చూసుకోకపోతే జీతంలో కోత**

**తెలంగాణ సర్కార్ 'మానవీయ' చట్టం!**

**కన్నవారికి కన్నీరు మిగిలిస్తే కఠిన చర్యలే..**

**నేడు అసెంబ్లీలో చారిత్రక బిల్లు!**

కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. సొంత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల ముక్కుపిండి మరీ భృతి వసూలు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది.

# ప్రతిపక్షానికి ఒక న్యాయం..

# పాలకులకు మరో న్యాయమా?

**రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌పై హౌస్ కమిటీ వేయాలి**

**జీవో 111 పరిధిలో నిబంధనలకు తిలోదకాలు**

**డీజిల్ జనరేటర్లతో అక్రమ దందా**

**అధికారుల నోటీసులే సాక్ష్యం..**

**మరి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది**

**అసెంబ్లీలో హరీశ్‌రావు నిలదీత"**

2



హైదరాబాద్ శివార్లలోని జీవో 111 పరిధిలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా భారీ స్టోన్ క్రషర్‌ను నిర్వహిస్తోందని, దీని వెనుక భారీ అవినీతి దాగి ఉందని హరీశ్‌రావు ఆధారాలతో సహా సభ ముందుంచారు. హరీశ్‌రావు పేర్కొన్నారు.

# 'స్త్రీధనం'తో ఆస్తి కొన్నారా?

**ఆధారాలు లేకపోతే ఆ హక్కు చెల్లదు**

**హైకోర్టు కీలక తీర్పు**

మహిళలకు తమ 'స్త్రీధనం'పై సంపూర్ణ హక్కులు ఉంటాయని అంగీకరిస్తూనే, ఆ డబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తుల విషయంలో తెలంగాణ హైకోర్టు ఒక సంచలన తీర్పునిచ్చింది. కేవలం "స్త్రీధనంతో కొన్నాను" అని చెబితే సరిపోదని, దానికి తగిన యాజమాన్య పత్రాలు మరియు సాక్ష్యాధారాలు సమర్పించాల్సిందేనని స్పష్టం చేసింది.

2



మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
ఆదివారం 29-03-2026

## మైనింగ్ చిచ్చు

నుంచి విచారణ ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. "2014 జూన్ 2 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాను. గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర వంటి నేతల మైనింగ్ వ్యాపారాలతో పాటు, నేరెళ్లలో జరిగిన ఇసుక దందాపైనా విచారణ జరుగుతుంది."

**కుటుంబ వ్యాపారాలు - రాజకీయ విమర్శలు** సీఎం రేవంత్ రెడ్డి నేరుగా హరీశ్‌రావు సోదరుడి ప్రస్తావన తెస్తూ విమర్శనాస్త్రాలు సంధించారు. హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు అక్రమాల వల్లే కేటీఆర్ గతంలో మైనింగ్ శాఖను తన గుప్పిట్లోకి తీసుకున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటికి ఆయన సోదరుల వ్యాపారాలతో సంబంధం లేదని సీఎం స్పష్టం చేశారు.

## డిఎంకే దూకుడూ

పటిష్టమైన ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు.

**కింగ్స్ ఇన్ ది రింగ్: కీలక అభ్యర్థుల బరి**

తొలి జాబితాలో పార్టీ అగ్రనేతలు తమ పాత కోటల నుంచే పోటీ చేస్తూ క్యాడర్‌లో ఉత్సాహం నింపుతున్నారు.హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన సీఎం స్టాలిన్, తన సొంత నియోజకవర్గమైన కొలత్తూరు నుంచే తిరిగి బరిలోకి దిగుతున్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, చెపాక్-ట్రిప్లికేన్ నుంచి మరోసారి తన సత్తా చాటనున్నారు. రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కోయంబత్తూరు సౌత్ నుంచి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పోటీ చేయడం ఆసక్తిని రేపుతోంది.

**ట్విస్ట్: డీఎంకే గూటిలో 'ఓపీఎస్'!**

ఈ ఎన్నికల్లో అతిపెద్ద విశేషం మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) డీఎంకే తరపున పోటీ చేయడం. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి వేదికైన బోడినాయకనూరు నుంచే ఆయన ఉదయించే సూర్యుడి గుర్తుపై బరిలోకి దిగుతుండటం తమిళ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

**'స్టాలిన్' మార్క్ పాలిటిక్స్**

తొలి జాబితాను గమనిస్తే, గత ఎన్నికల కంటే ఈసారి డీఎంకే సొంతంగా ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తూ 'కింగ్ మేకర్' అవసరం లేకుండానే అధికారాన్ని చేజిక్కించుకోవాలని భావిస్తోంది. ఓపీఎస్ వంటి కీలక నేతలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా విపక్షాల ఓటు బ్యాంకును దెబ్బకొట్టే మాస్టర్ ప్లాన్ అమలవుతోంది.

## "రాజధానిని ఎవరూ టచ్ చేయలేరు..

వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. "రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదనడానికి వీళ్లకు ఏమైనా సొంత రాజ్యాంగం ఉందా? వీరు అనుసరించేది రాజారెడ్డి రాజ్యాంగం అయితే.. దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం. జగన్ లాంటి ఊసరవెల్లి రాజకీయాల వల్లే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. రైతులపై ఉక్కుపాదం మోపి, లాఠీలు, బూట్లతో తన్నించిన కీచకపర్వాన్ని ఈ రాష్ట్రం ఎన్నటికీ మరువదు."

**విజన్ 2028: నవ్యాంధ్ర నవ నిర్మాణం:** అమరావతి నిర్మాణం కేవలం ఒక నగరం కాదు, అది ఒక ఆర్థిక శక్తి అని సీఎం వివరించారు. ప్రస్తుతం రూ. 56 వేల కోట్ల విలువైన 91 పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2027 నాటికి ట్రంక్ రోడ్లు, లేఅవుట్లు పూర్తి చేసి.. 2028 నాటికి అమరావతికి పూర్తి స్థాయి రూపాన్ని తీసుకువస్తాం. అమరావతి రాజధానిగా ఉంటూనే.. విశాఖ, తిరుపతి రీజియన్లను కూడా మూడు ప్రధాన ఆర్థిక కేంద్రాలుగా అద్భుతంగా అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి ఏడాదికి రూ. 1.05 లక్షల కోట్ల ఆదాయం వస్తుంటే.. అమరావతి కూడా అదే స్థాయికి చేరి తెలుగువారి వైభవాన్ని ప్రపంచానికి చాటాలి.

**చరిత్ర పుటల నుండి.. భావి తరాల వరకు:** శాతవాహనుల ఘన చరిత్ర కలిగిన అమరావతి, కృష్ణా-గోదావరి నదుల మధ్య ఉన్న పుణ్యభూమి అని సీఎం గుర్తు చేశారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం అమరావతి చరిత్ర భద్రంగా ఉందని, అటువంటి ప్రాచీన సంస్కృతి కలిగిన నేలను అజేయంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఎన్టీఆర్ హయాంలోనే మనకు 'ఆంధ్రులు' అనే గుర్తింపు వచ్చిందని, ఆ ఆత్మగౌరవానికి అమరావతి ప్రతీక అని పేర్కొన్నారు.

## విశ్వ సంక్షోభంలోనూ భారత్ సురక్షితం

భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**జేవర్ ఎయిర్‌పోర్ట్: గగనతలంలో భారత్ గర్జన**

ప్రధాని ప్రారంభించిన ఈ విమానాశ్రయం కేవలం ఒక రన్‌వే మాత్రమే కాదు, అది భారత ఆర్థిక శక్తికి నిదర్శనం. సరకు రవాణాను వేగవంతం చేస్తూ ప్రపంచ మార్కెట్లను అనుసంధానించే లాజిస్టిక్ జోన్‌లను ఇక్కడ సిద్ధం చేశారు. 3,900 మీటర్ల పొడవైన రన్‌వేపై ప్రపంచంలోనే అతిపెద్ద జెట్ విమానాలు సునాయాసంగా ల్యాండ్ అయ్యేలా అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు.

"రాజకీయాల కోసం భయాందోళనలు సృష్టించే వారిని నమ్మవద్దు. దేశ ప్రయోజనాలే మాకు పరమావధి. ప్రపంచం ఎటు వెళ్తున్నా, భారత్ మాత్రం తన లక్ష్యం వైపు దూసుకుపోతుంది."

--- ప్రధాని మోదీ కరాఖండి సందేశం

**విపక్షాల తప్పుడు ప్రచారాలకు చెక్:** ఇంధన సంక్షోభాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న పార్టీలకు ప్రధాని గట్టి కౌంటర్ ఇచ్చారు. సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారంతో ప్రజలను ఆందోళనకు గురిచేయడం దేశద్రోహంతో సమానమని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ప్రభుత్వ విధానాలన్నీ దేశ భద్రతను, ఆర్థిక సుస్థిరతను దృష్టిలో ఉంచుకునే ఉంటాయని హామీ ఇచ్చారు.

## టిప్పర్ - బైక్ డీ, ఇద్దరు మృతి

**నిర్మల్ జిల్లా, మార్చి 28(ప్రజా ముద్ర న్యూస్) :** కడెం మండలం ఉడుంపూర్ - రాంపూర్ మధ్యగల ప్రధాన రహదారిపై టిప్పర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్రంమదిరే గ్రామానికి చెందిన ఇరువురు బంధువులు ఉమికే భీమ్ రావ్ (20), కుమ్ర రాంబాయ్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం పట్ల విచారణ చేపడుతున్నారు. పనుల నిమిత్తం కడెం మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.




## జీతం మీది...జీవితం వాళ్లది

కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. సొంత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల ముక్కుపిండి మరీ భృతి వసూలు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది.

బిల్లులోని ముఖ్యాంశాలు ఢ నిబంధనలు:

**జీతం నుంచి నేరుగా కట్!**

తల్లిదండ్రులను సంరక్షించని పక్షంలో ఉద్యోగి నెలవారీ వేతనం నుంచి కొంత భాగాన్ని ప్రభుత్వం నేరుగా మినహాయిస్తుంది. ఎంత మొత్తం: వేతనంలో 15 శాతం లేదా గరిష్ఠంగా రూ. 10,000 (ఏది తక్కువైతే అది). ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బందితో పాటు ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే వారు కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తారు.

**ఫిర్యాదు మరియు విచారణ ప్రక్రియ**

బాధిత తల్లిదండ్రులు తమ పిల్లల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ (నియమిత అధికారి)కు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు అందిన 60 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలి. అధికారి ఆదేశాల మేరకు ఉద్యోగి జీతం నుంచి మినహాయించిన సొమ్ము నేరుగా తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది.

**ఉన్నత స్థాయి అప్పీల్ సౌకర్యం**

ఒకవేళ జిల్లా స్థాయి నిర్ణయంపై అసంతృప్తి ఉంటే, రాష్ట్ర స్థాయి వయోవృద్ధుల కమిషన్ను ఆశ్రయించవచ్చు. ఈ కమిషన్‌కు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సారథ్యం వహిస్తారు. కమిషన్ 60 రోజుల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలి, తద్వారా బాధితులకు వేగంగా న్యాయం జరుగుతుంది.

**నైతిక బాధ్యత** ఈ బిల్లు కేవలం శిక్షాత్మక చర్య మాత్రమే కాదు, ఆధునిక కాలంలో మరుగున పడుతున్న కుటుంబ విలువలను పునరుద్ధరించే ప్రయత్నం. నగరాలకు వలసలు, చిన్న కుటుంబాల ధోరణి వల్ల గ్రామాల్లో ఒంటరైన వృద్ధులకు ఇది కొండంత అండగా నిలవనుంది. ఈ బిల్లు ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది: "ఆస్తిపాస్తులు, ఉద్యోగాలు ముఖ్యం కాదు.. కన్నవారి గౌరవం, సంరక్షణే ప్రథమ కర్తవ్యం." నేడు అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు.

## 'స్త్రీధనం'తో ఆస్తి కొన్నారా?

**హైదరాబాద్, మార్చి 28 :** మహిళలకు తమ 'స్త్రీధనం'పై సంపూర్ణ హక్కులు ఉంటాయని అంగీకరిస్తూనే, ఆ డబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తుల విషయంలో తెలంగాణ హైకోర్టు ఒక సంచలన తీర్పునిచ్చింది. కేవలం "స్త్రీధనంతో కొన్నాను" అని చెబితే సరిపోదని, దానికి తగిన యాజమాన్య పత్రాలు మరియు సాక్ష్యాధారాలు సమర్పించాల్సిందేనని స్పష్టం చేసింది.

**స్త్రీధనం అంటే ఏమిటి? పరిధిని స్పష్టం చేసిన ధర్మాసనం**

చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం స్త్రీధనంపై స్పష్టమైన నిర్వచనాన్ని ఇచ్చిందివివాహానికి ముందు, సమయంలో లేదా వివాహం తర్వాత లభించిన బహుమతులు. బిడ్డ పుట్టినప్పుడు లేదా వైధవ్యం సమయంలో లభించిన (చర లేదా స్థిర) ఆస్తులు. ఈ ఆస్తిని అనుభవించడానికి, విక్రయించడానికి లేదా బదిలీ చేయడానికి మహిళకు సర్వహక్కులు ఉంటాయి.

**వివాదం ఏమిటి? ఎందుకు ఈ తీర్పు ఇచ్చారు?**

హసన్‌పర్తి జిల్లా, నాగారం గ్రామంలోని 8 ఎకరాల భూమి ఈ వివాదానికి మూలం. వాస్తవానికి ఈ భూమి మహిళ భర్త పేరిట ఉండేది. అప్పుల కారణంగా 2007లో కోర్టు దీనిని వేలం వేయగా, ప్రైవేట్ వ్యక్తులు దక్కించుకున్నారు. అయితే, ఆ భూమిని తన 'స్త్రీధనం'తో కొనుగోలు చేశానని, కాబట్టి వేలం చెల్లదని సదరు మహిళ కోర్టును ఆశ్రయించింది.

**సాక్ష్యాలు లేని వాదన నిలబడదు**

సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలును ధర్మాసనం కొట్టివేసింది. దీనికి ప్రధాన కారణాలుమ్యుటేషన్ రికార్డులు: కోర్టు వేలంలో భూమి పొందిన వారి పేరు మీద రికార్డులు మార్చాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్లో తప్పులేదని కోర్టు భావించింది.సదరు మహిళ తన స్త్రీధనంతోనే ఆ భూమి కొన్నట్లు నిరూపించే ఎలాంటి పత్రాలను (ఉత్త్రీవ ఐవవంం) సమర్పించలేకపోయారు.చట్టప్రకారం స్త్రీధనంపై మహిళకు పూర్తి అధికారం ఉన్నప్పటికీ, ఆ నిధులతో కొనుగోలు చేసే ఆస్తుల విషయంలో పక్కాగా రికార్డులు నిర్వహించడం ప్రాముఖ్యతను ఈ తీర్పు గుర్తు చేస్తోంది. ఆధారాలు లేని పక్షంలో ఆస్తిపై హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని న్యాయస్థానం హెచ్చరించింది.

## ప్రతిపక్షానికి ఒక న్యాయం.. పాలకులకు మరో న్యాయమా?

**హైదరాబాద్ మార్చి 28:** హైదరాబాద్ శివార్లలోని జీవో 111 పరిధిలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా భారీ స్టోన్ క్రషర్‌ను నిర్వహిస్తోందని, దీని వెనుక భారీ అవినీతి దాగి ఉందని హరీశ్‌రావు ఆధారాలతో సహా సభ ముందుంచారు. హరీశ్‌రావు పేర్కొన్న విధంగా సదరు సంస్థ ఈ క్రింది నిబంధనలను యథేచ్ఛగా తుంగలో తొక్కింది శంషాబాద్ మండలం కోత్వాల్ గూడ (సర్వే నం. 62, 63) వంటి కాలుష్య కారక పరిశ్రమలు నిషేధించబడిన ప్రాంతంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు. స్టోన్ క్రషర్ రూల్స్ 2026 ప్రకారం ఉండాల్సిన మినరల్ డీలర్ లైసెన్స్ (వీఐఎ) లేదు.పరిశ్రమ స్థాపనకు), నిర్వహణకుకావాల్సిన కన్సెంట్ సర్టిఫికెట్లు ఏవీ లేవు. పై అనుమతులు లేకపోవడంతో అధికారిక విద్యుత్ కనెక్షన్ రాదు, అందుకే భారీ డీజిల్ జనరేటర్ల సాయంతో పర్యావరణానికి హాని కలిగిస్తూ క్రషర్ నడుపుతున్నారు.

**దాడులు - అధికారుల నివేదికల క్రోనాలజీ**

ఈ దోపిడీపై అధికారులే స్వయంగా ఇచ్చిన నోటీసులను హరీశ్‌రావు సభలో చదివి వినిపించారు

**మే 21, 2025:** మైనింగ్ అధికారుల తనిఖీలో 5,130 మెట్రిక్ టన్నుల అక్రమ రఫ్ స్టోన్ నిల్వలు గుర్తింపు.మార్చి 4, 2026: రెండోసారి తనిఖీ చేసినప్పుడు ఏకంగా 11,200 మెట్రిక్ టన్నుల ముడి సరుకు లభ్యం.

**మార్చి 5, 2026:** ఈ సంస్థ వల్ల మూసీ నది, గండిపేట్, హిమాయత్‌సాగర్ కాలుష్యమవుతున్నాయని మైనింగ్ అధికారులే లేఖ రాశారు.

**రాజకీయ విమర్శలు డిమాండ్లు**

**పక్షపాత ధోరణి:** గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యే తమ్ముడిపై చిన్న పొరపాటుకే కఠిన చర్యలు తీసుకున్న ప్రభుత్వం, అధికార పార్టీ మంత్రికి సంబంధం ఉన్న సంస్థపై ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు.

**మంత్రి ప్రమేయం:** రాఘవ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్లుగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు (భార్య, కుమారుడు, సోదరుడు) ఉన్నారని, అది ఆయన సంస్థేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్:** ఈ కుంభకోణంపై విపక్ష సభ్యులతో హౌస్ కమిటీ వేయాలని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## నెల్లూరు గ్రామీణంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి భారీ ప్రణాళిక

### అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి హామీ

### సీఎస్ఆర్ నిధులతో మౌలిక సదుపాయాల మెరుగుదల

### విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం

### మంత్రి పొంగూరు నారాయణ

**నెల్లూరు, మార్చి 28 :-** నెల్లూరు గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన మంత్రి పొంగూరు నారాయణ, ఆ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వీఆర్‌సీ మోడల్‌ను ఆదర్శంగా తీసుకుని పాఠశాల మౌలిక వసతులను మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఈ సందర్శనలో గ్రామీణ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులతో కలిసి పాఠశాలలోని సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదులు, తాగునీరు, పరిశుభ్రత, ఇతర అవసరాలను సమీక్షించి, లోపాలను గుర్తించారు. పాఠశాల అభివృద్ధికి అమర్ నిర్మాణ సంస్థ సహకారంతో రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులను వినియోగించనున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు, విద్యా సౌకర్యాలు, సాంకేతిక వనరులను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు.గ్రామీణ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను కూడా నెల్లూరు నగరంలోని పాఠశాలల స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. విద్యా ప్రమాణాలను సమానంగా పెంచడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం చేయడం కూడా ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరం మరియు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సైకిళ్లను త్వరలోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల చదువుకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా కొనసాగుతోంది.





## నాయుడుపల్లిలో మిన్నంటిన రోదనలు...

### మార్కాపురం ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లకు కన్నీరుమున్నీరుగా నివాళులు..!

**దుత్తలూరు మార్చి 28,** మార్కాపురం సమీపంలో గురువారం జరిగిన హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన గొల్లపల్లి వెంకటేశ్వర్లు మృతదేహం శనివారం ఆయన స్వగ్రామమైన దుత్తలూరు మండలం నాయుడుపల్లికి చేరుకుంది.మృతదేహాన్ని చూసిన వెంటనే గ్రామంలో రోదనలు మిన్నంటాయి. భార్య సుజాతతో పాటు చిన్నారుల దుస్థితి గ్రామస్తులను కంటతడి పెట్టించింది.ఈ సందర్భంగా దుత్తలూరు మండల కన్వీనర్ ఉండేల గురువారెడ్డి, సీనియర్ నాయకులు మల్లవరపు గురవయ్య నాయుడు తదితరులు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.అనంతరం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరపున ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నాయకులు తెలిపారు.





# అట్టహాసంగా అబాకస్ సెంటర్ ప్రారంభం..

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి కార్యాలయం సందర్శన

**అమీన్‌పూర్, మార్చి 28:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ పరిధిలో సీబీఆర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా, రాజకీయ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. శనివారం బీరంగూడలోని సంస్కృతి స్కూల్‌లో రోమన్ కుమార్ రెడ్డి, జ్యోతి దంపతులు ఏర్పాటు చేసిన 'అబాకస్' కోచింగ్ సెంటర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. విద్యార్థుల్లో మేధోశక్తిని పెంచే ఇలాంటి కోచింగ్ సెంటర్లు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

**ఘన స్వాగతం.. సన్మాన కార్యక్రమం:** అనంతరం అమీన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దండు రమేష్ యాదవ్ కార్యాలయాన్ని సుధా శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా దండు రమేష్ యాదవ్ – నిర్మల దంపతులు ఆమెకు శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఇదే వేదికపై నూతనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన వి. సునీత, ఈశ్వర్ రెడ్డిలను జిల్లా అధ్యక్షురాలి సమక్షంలో ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి టెంపుల్ చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్, శివాలయ డైరెక్టర్లు కుమ్మరి మహేష్, ఆశ గారి లక్ష్మణ్, గొల్ల మల్లేష్, కుంచెం ఎల్లన్న, అల్వార్తి మల్లేష్ పాల్గొన్నారు. అలాగే ఆత్మ కమిటీ డైరెక్టర్లు మన్నె రవీందర్, పల్లపు బిక్షపతి, మాజీ కౌన్సిలర్ మున్నాభాయ్, సీనియర్ నాయకులు ప్రకాశ్, ఉమా శంకర్, బిల్లే శ్రీనివాస్ యాదవ్, గోపాల్ నరాల శెట్టి, సైదిరెడ్డి పాశం, రాజశేఖర్, వసుంధర్, సుధాకర్, అల్లంశెట్టి, జయవర్ధన్, చుక్కా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ మరియు పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.





# శాస్త్రీయ సంగీతం గొప్ప యజ్ఞం లాంటిది

## మనస్సును తేలికవర్చే, ఉత్సాహాన్ని నింపే మహత్తర కళ

## పలువురు వక్తల ఉద్ఘాటన

**రామచంద్రాపురం, మార్చి 28(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
శాస్త్రీయ సంగీతం ఒక గొప్ప యజ్ఞంలాంటిదని, దాన్ని సాధించేందుకు కఠోర సాధన, అపారమైన నిబద్ధత అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కాలనీ వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ గణపతిసచ్చిదానంద ఆశ్రమంలోని పంచముఖ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో "శ్రీరామ వైభవం" సంగీత విభావరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి స్వరాలయం అకాడమీ బృంద సభ్యులు తమ సంగీత ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. అకాడమీ నిర్వాహకురాలు మల్లాది విమ్మప్రియ అరవింద్ ఆధ్వర్యంలో తన్వి శ్రీ, సుమేధశ్రీలు ఆలపించిన రామదాసు కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సంగీతం విశ్వవ్యాప్తంగా వ్యాపించి ఉన్న మానవ జీవితానికి అంతర్భాగమని అన్నారు. ప్రకృతిలోనే సంగీతం నిక్షిప్తమై ఉండి, జీవన గమనాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. సంగీతానికి ఎలాంటి సరిహద్దులు లేవని, ఇది ప్రపంచాన్ని ఒకే తాటిపై నిలిపే మానవ భాష అని కొనియాడారు. సంగీతాన్ని నేర్చుకోవడం అంత సులభం కాదని, దీన్ని యజ్ఞంతో సమానంగా భావించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంగీత విద్వాంసుల గాత్రం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, శాస్త్రీయ పరిశోధనలు కూడా సంగీతం మన ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని సూచిస్తున్నాయని చెప్పారు. ఇది మనసును ఉల్లాసంగా, శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడంలో సహాయపడుతుందని వివరించారు. పిల్లలకు చిన్న వయసు నుంచే సంగీతంపై అవగాహన కల్పించి, దానిపై ఆసక్తి పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులదేనని వక్తలు సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ చిన్నారులకు భారతీయ కళల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా రామదాసు కీర్తనలతో ఆకట్టుకున్న సంగీత కళాకారులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.





# పిఎన్ఆర్ కాలనీలో 'బాల్యం ఐరా' స్కూల్ ఘన ప్రారంభం

## ముఖ్య అతిథులుగా మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి,

## బిఆర్ఎస్ నేతలు ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్

**అమీన్‌పూర్, మార్చి 28:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** పిల్లలకు చిన్నతనం నుండే నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను అందించినప్పుడే వారు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని పిఎన్ఆర్ కాలనీ, అడోబ్ ఎం జె లేక్ వ్యూ హైట్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'బాల్యం ఐరా' స్కూల్‌ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మరియు మాజీ కౌన్సిలర్ భర్తలు చింతా ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.

**విలువల విద్యా బోధన జరగాలి – నేతల పిలుపు:**

ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను ఉద్దేశించి పాండురంగారెడ్డి మాట్లాడుతుండగా, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్ జోక్యం చేసుకుంటూ.. నేటి పోటీ ప్రపంచంలో కేవలం మార్కుల కోసమే కాకుండా, పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా బోధన సాగాలి. ముఖ్యంగా ప్రాథమిక దశలోనే పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగించేలా 'బాల్యం ఐరా' వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయం. అమీన్‌పూర్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన విద్య అందడం గర్వకారణం" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్ ,కూడా హాజరై పాఠశాల స్థాపన వెనుక ఉన్న ఆశయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..





# వికలాంగుల పెన్షన్ పెంచాలి టి ఆర్ వి ఎస్, మెదక్ జిల్లా అధ్యక్షుడు

**చేగుంట మార్చ్ 28 మెదక్ టుడే న్యూస్** వికలాంగుల పింఛన్ రూ. 6000 రూపాయలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టిఆర్విఎస్) మెదక్ జిల్లా అధ్య క్షుడు మీర్ గియాజ్ ఉద్దీన్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగుల పెన్షన్ 6000 పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు అవుతున్నా పెంపు ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. నిరుడు రాష్ట్ర వ్యాప్తంగా 44,49,767 మందికి పెన్షన్ రాగా, ప్రస్తుతం



42,80,129 మందికి మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షన్లు పెంచడానికి డబ్బులు లేవని చెప్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. గాంధీ కుటుంబానికి మాత్రం రూ.1000 కోట్లు ఏలా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో వికలాంగుల పెన్షన్ల పెంపునకు నిధులను కేటాయించ లేదు అని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు ఇస్తామన్న పెన్షన్ పెంచి, ఉద్యోగ, ఉపాధి తో దివ్యాంగుల సమాజాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# చేగుంట రైల్వే గేటు వద్ద ఉద్రిక్తత

## పోలీసులను కొట్టిన దుండగులు రిమాండ్‌కు

**చేగుంట మార్చ్ 28 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం, స్థానిక రైల్వే గేటు వద్ద విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సాయంత్రం మెదక్ వైపు నుండి రాంగ్ రూట్‌లో వచ్చిన ౧+35 9676 నంబర్ గల కారు వల్ల భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి, అత్యవసరంగా వెళ్తున్న అంబులెన్స్ కూడా చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేస్తుండగా, తూప్రాన్ పట్టణానికి చెందిన ఎరువ విజయ్ కృష్ణ పోలీసుల విధులకు అడ్డంకిగా మారి దుర్భాషలాడుతూ కానిస్టేబుల్‌పై శారీరక దాడికి దిగాడు. అనంతరం అతని భార్య దనుశ్రీ, స్నేహితులు రామన్నగారి పవన్, వంజరి బాలాజీ కలిసి పోలీసు సిబ్బందిని చేతులతో కొట్టడంతో మరొక పోలీసు అధికారికి గాయాలయ్యాయి. అంతేకాకుండా బ్లూ కోట్ ట్యాబ్‌ను లాగి కింద పడేసి ధ్వంసం చేశారు. ఈ ఘటనపై చేగుంట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నేబర్ . 93/2026 నమోదు చేసి, యు /స్ 126(2), 132, 121(1) ర్ /ష 3(5) దీచీూ తో పాటు ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసినందుకు ాావష 3ాఱూాాాూ్ కింద కఠినమైన కేసులు నమోదు చేశారు. నిందితులు విజయ్ కృష్ణ, పవన్, బాలాజీలను ఈరోజు అరెస్ట్ చేయగా, దర్యాప్తు కొనసాగుతోంది.

# చేగుంట లో తైబజార్ వేలం




**చేగుంట మార్చ్ 28 మెదక్ టుడే న్యూస్** చేగుంట తైబ జార్ వేలం రూ. 24లక్షల0 5 వేల రూపాయలకి చేగుంట గ్రామానికి చింతల భూపాల్, దక్కించుకున్నారు. శనివారం చేగుంట గ్రామం పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ మండల పంచాయతీ అధికారి విజయపాల్, కార్యదర్శి వెంకటేష్, సర్పంచ్ సంద్రగు స్రవంతి, సతీష్, ఉపసర్పంచ్ రఫిక్, పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ తై బజార్ వేలం ప్రక్రియ నిర్వహించారు. గ్రా మానికి చెందిన 8 మంది వ్యక్తులు తైబజార్ వేలం లో పాల్గొనగా చింతాల భూపాల్, రూ.24 లక్షల 05 వేల రూపాయలకు వేలంపాటలో తై బజార్ దక్కించుకున్నారు. 2026 ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి 2027 మార్చి 31 వరకు ఈ తై బజార్ అమల్లో ఉండనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో వా ర్డు సభ్యులు గ్రామ పెద్దలు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మార్కాపురం ప్రమాదం విషాదం...

## ఆత్మకూరు చిన్నయ్య మృతదేహం స్వగ్రామానికి చేరిక, కుటుంబంలో దుఃఖసాగరం..!

**కలిగిరి మార్చి 28,** కలిగిరి మండలం నాగసముద్రం ఎస్సీ కాలనీలో విషాద వాతావరణం నెలకొంది.మార్కాపురం సమీపంలో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఆత్మకూరు చిన్నయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులు



స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసిన వెంటనే కుమార్తెలు, కుటుంబ సభ్యులు, స్థానికులు బోరున విలపించారు. ఆ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచివేసింది.ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ పూసాల వెంగపనాయుడు, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, సిహెచ్. తాతయ్య, వై. రమణారెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున తక్షణ మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు.మృతుని కుటుం బానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, పిల్లల చదువులు మరియు భవిష్యత్తు విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఏఐటీయూసీ పోరాటం ఫలితం

## సెంట్రింగ్ కార్మికులకు దక్కిన న్యాయం...

**ఏర్పేడు మార్చి 28.**ఏర్పేడు మండలం చింతలపాలెం సమీపంలోని ఎస్ఎస్సీ ప్రాజెక్ట్ వద్ద సెంట్రింగ్ కార్మికులకు ఎదురైన సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. గత వారం రోజులుగా కార్మికులకు రావలసిన సెంట్రింగ్ సామాగ్రిని యాజమాన్యం ఇవ్వకపోవడంతో, ఏఐటీయూసీ జిల్లా సెక్రెటరీ రాధాకృష్ణ



రంగంలోకి దిగి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు.?ఈ పోరాటంలో భాగంగా శనివారం ఏఐటీయూసీ నాయకులు వైఎస్ మణి, కార్తీక్, మరియు రసూల్ నేరుగా యాజమాన్యంతో చర్చలు జరిపి, కార్మికులకు చెందాల్సిన సామాగ్రిని వారికి తిరిగి ఇప్పించారు. సామాన్యుల పక్షాన నిలబడి పోరాడి సాధించిన ఈ విజయం పూర్తిగా ఏఐటీయూసీ సంఘానికే దక్కుతుందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ వివాదాన్ని సామరస్యంగా ముగించి, కార్మికులకు న్యాయం జరిగేలా సహకరించిన ఏర్పేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి కి ఏఐటీయూసీ నాయకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# జీసీసీ కార్యాలయం ఎదుట మహిళ ఆందోళన

## బెనిఫిట్స్ కోసం లంచం డిమాండ్ ఆరోపణ

## గ్రాట్యుటీ కోసం ఏడాది నుంచి తిరుగుతున్న మహిళ

## అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన

**విశాఖపట్నం, మార్చి 28** విశాఖలోని గిరిజన సహకార సంస్థ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మహిళ ఆందోళనకు దిగింది. తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని అడిగితే అధికారులు రూ. లక్ష లంచం డిమాండ్ చేస్తున్నారని కృష్ణకుమారి అనే మహిళ ఆరోపించారు. కృష్ణకుమారి భర్త జీసీసీలో పనిచేసి రిటైర్ అయ్యారని, ఆయనకు సంబంధించిన గ్రాట్యుటీ మరియు ఇతర బెనిఫిట్స్ ఇప్పటికీ ఇవ్వలేదని ఆమె తెలిపారు. కుమార్తె పెళ్లి కోసం ఆ డబ్బు అత్యవసరమని చెబుతూ, పలుమార్లు అధికారులను సంప్రదించినా స్పందన లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన సమస్య



పరిష్కారం కోసం ఏడాది కాలంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. ప్రతి సారి కొత్త కారణాలు చెబుతూ ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు.బెనిఫిట్స్ ఇవ్వడానికి ముందుగా లంచం ఇవ్వాలని అధికారులు సూచించారని ఆమె పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు అందాల్సిన హక్కులను పొందడానికి కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదురవడం బాధాకరమని అన్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ సంస్థల్లో అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఈ అంశాన్ని గమనించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా ఈ ఘటన ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# గొప్ప దైవ భక్తుడు ఎమ్మెల్యే జిఎంఆర్..

## పటాన్చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయానికి 75 లక్షల భారీ విరాళం..

## నేటి వరకు సొంత నిధులతో 210 కు పైగా దేవాలయాల నిర్మాణం..

## ప్రతి ఒక్కరిలో భక్తి భావం , మతసామరస్యాన్ని పెంపొందించడమే మా లక్ష్యం

## ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు మార్చి :28(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** ఒక వైపు అభివృద్ధిలో మరో వైపు ఆధ్యాత్మికలో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రతీకగా నిలుపుతూ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా గుడి, మసీదు, చర్చి నిర్మిస్తే తన వంతు సహకారాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. తాజాగా..పటాన్చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి 75 లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని.. మానవత్వం, ప్రేమ, శాంతి, మరియు సోదరభావం మతాల మూల సూత్రమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూ.. పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గత 20 సంవత్సరాలుగా పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 210 కి పైగా దేవాలయాలు, వందకు పైనా మసీదులు, ఆశిర్ఖానాలు, 30 కి పైగా చర్చిలు నిర్మించి పరమత సహనానికి ప్రతీకగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు.. దైవం పట్ల అచంచల విశ్వాసం, నిష్కామ కర్మ, మరియు క్రమశిక్షణతో కూడిన జీవనం ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంచుతాయని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలను మర్చిపోయి, మానవుడిగా ప్రతి ఒక్కరూ సన్మార్గాన్ని అనుసరించడమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్న మధు, ప్రభాకర్, సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





# ఎ పి ఆర్ లగ్జరియాలో వైభవంగా స్పటిక లింగ ప్రాణప్రతిష్ట

## ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**పటాన్చెరు, మార్చి : 28 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎ పి ఆర్ లగ్జరియా వేదికగా నూతన దేవాలయ నిర్మాణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా కాశీ క్షేత్ర విశ్వనాథ స్పటిక లింగ ప్రాణప్రతిష్ట మరియు సీతారామచంద్రుల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కన్నుల పండువగా సాగింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్సభ్యులు శ్రీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు నరేష్ కుమార్ రాజ్ నాగసాని మరియు ఇతర ముఖ్య నాయకులు, మిత్రబృందం పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**దశమి వేళ వెలిసిన స్పటిక లింగం:**

దశమి తిథి పురస్కరించుకుని జరిగిన ఈ ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో స్పటిక లింగ దర్శనం భక్తులకు విశేష ఆకర్షణగా నిలిచింది. అత్యంత శక్తి ప్రసరిస్తూ, ఆకర్షణీయంగా ఉన్న స్పటిక లింగాన్ని దర్శించుకోవడం శుభదాయకమని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బీజేపీ కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





# టిడిపి కార్యకర్త పై దాడి దాడికి యత్నం వాహానం ధ్వంసం

**బద్వేలు, మార్చి 28:** టిడిపి ఆవిర్భావం నుండి యాక్టివ్ కార్యకర్త గా పనిచేస్తున్న నరసింహారెడ్డి పై నిన్న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసేందుకు ప్రయత్నించారని అలాగే దుండగులు మా కారును ధ్వంసం చేశారని ఒక ప్రకటనలో తెలియజేశారు బద్వేల్ టౌన్ సురేంద్ర నగర్ నరసింహారెడ్డి అత్తగారి ఇంటి వద్ద ఈ సంఘటన జరిగింది అని తెలియజేశారు. నా కారు అద్దాలు పగలగొట్టి ఇంటి ప్రహరీ గోడ లోపల మద్యం బాటిల్ విసిరా రవి ఈ సంఘటన. నిన్న రాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలియజేశారు.నాపై నేరుగా దాడికి యత్నించే ఆలోచనతోనే దుండగులు వచ్చినట్లు నాకు సంఘటనను బట్టి తెలుస్తోంది అని అన్నారు. ఆ సమయంలో నేను అక్కడ లేకపోవడంతో నా కారుపై దాడి చేసి బయబ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేశారు అని తెలియజేశారు. గత కొంత కాలంగా బద్వేల్ టీడీపీ ఇన్ చార్జ్ పై నేను కొన్ని ఆరోపణలు చేశాను అని. వాటిని దృష్టిలో పెట్టుకుని నన్ను, నా కుటుంబాన్ని పలురకాలుగా ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటన కూడా ఆ నేపద్యంలోనే జరిగిందని భావిస్తున్నట్టు తెలియజేశారు. నిజమైన టీడీపీ కార్యకర్తగా పార్టీని కాపాడాలన్న ప్రయత్నంలోనే బద్వేల్ నియోజకవర్గ టీడీపీలో జరుగుతున్న విదానాలపై నేను గళం విప్పుతున్నాను అని,ఇది కొంతమందికి ఇబ్బందికరంగా మారడంతోనే నా పై ఇలా భౌతిక దాడులకు రౌడీ మూకలను ఉసిగొలుపుతున్నారు అని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను అని తెలియజేశారు. మా పార్టీ అదిష్టానం దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెలతాను. ఇలాంటి బెదిరింపులకు బయపడకుండా ఇక్కడ పార్టీని కాపాడుకోవడం కోసం నేను నా పోరాటాన్ని కొనసాగిస్తాను. దీనిపై పోలీసులు కచ్చితమైన విచారణ చేసి నాకు న్యాయం చేయాలని కోరారు





printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.
medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..